క్లుప్తంగా

వైభవంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ ఇందిరా రమణారావు స్వగృహం నుంచి తిరుమంజన పూజా సామగ్రి, శ్రావణ పట్టి (సారె) మేళతాళాలతో ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. గోదాదేవి ఉత్సవమూర్తికి వేదపండితులు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష తులసి పూజ



పమిడిముక్కల: మంటాడ శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక ఆగమన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు సోమవారం లక్ష తులసి పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. ఆలయ ఈఓ సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామ్మోహన రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



గుడివాడ టౌన్: పట్టణంలో స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని కోరుతూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. స్థానిక పెద ఎరికపాడు 25వ వార్డులో గడప గడపకు వెళ్లి సంతకాలు సేకరించారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని వామపక్షాల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి. ప్రకాష్‌బాబు, సీహెచ్. సత్యన్నారాయణ, సీఐటీయూ నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, పి. సురేష్, ఎల్. సురేంద్ర, బి. ప్రసాదు, వామపక్ష కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం షాపుల అద్దెదారుల నూతన కార్యవర్గ కమిటీ ఎంపిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా పి. నంద కిషోర్, గౌరవ అధ్యక్షుడిగా జవ్వాజి గంగరాజు, ఉపాధ్యక్షులుగా శేగు సత్యన్నారాయణ, కె. రాజేష్ మాధవ్, కార్యదర్శి ఎ. వెంకటరత్నం, సహాయ కార్యదర్శి డి. శివకృష్ణ, కోశాధికారి ఎ. శ్రీనివాస్‌తో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. ఎంపికైన సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

దోమల నివారణకు కృషి చేయాలి



కూచిపూడి(మొవ్వ): దోమల నివారణకు విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని, నివాస ప్రాంతాల్లో మురుగు నీటి నిల్వ లేకుండా చూడాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ రాజు సూచించారు. సోమవారం మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర ఓరియంటల్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులపై మిమిక్రీ, వెంట్రుకలయిజం (మాట్లాడే బొమ్మ) ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ కె. రామాంజనేయులు, ఆశ వర్కర్లు, ఎల్. విజయలక్ష్మి, శ్యామల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మండవల్లి: మండవల్లి ఎంపీపీ–2 స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం పరిశీలించారు. మెనూ ప్రకారం వండిన ఆహారాన్ని రుచి చూశారు. పాఠశాలలో 84 మంది విద్యార్థులకు గాను 70 మంది ఆహారం తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. సురేష్, హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.



బురదమయంగా అంతర్గత రోడ్లు



నివాసాల మధ్య చేరిన మురుగునీరు



కాలనీలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

అభివృద్ధికి ఆమడదూరం

- కనకదుర్గమ్మ కాలనీలో సమస్యలు తిష్ట
- రోడ్లు, డ్రెయిన్లు లేక అవస్థలు
- తాగునీటికీ తప్పని తిప్పలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారులో ఉన్న కనకదుర్గమ్మ కాలనీ సమస్యలతో సతమతమవుతోంది. ప్రజా ప్రతినిధుల ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దుర్గమ్మ కాలనీ అభివృద్ధికి ఆమడదూరంలో నిలుస్తోంది. ఇటు పాలకులు, అటు అధికారులు పట్టించుకోకపోవడంతో తమ కాలనీ రాత మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెళితే.. తోట్లవల్లూరు – ఉయ్యూరు ప్రధాన రహదారి వెంబడి కనకదుర్గమ్మ కాలనీ ఏర్పాటై సుమారు 20 సంవత్సరాలు అవుతోంది. విజయవాడ కనకదుర్గ దేవస్థానానికి చెందిన 9.50 ఎకరాలను 2004లో అప్పటి ప్రభుత్వం సేకరించి ప్రజలకు నివేశన స్థలాలుగా పంపిణీ చేసింది. కాలనీలో వివిధ వర్గాలకు చెందిన సుమారు 250 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నాయి. అయితే ఇళ్లస్థలాలు ఇచ్చి 20 ఏళ్లు గడుస్తున్నా కాలనీ మాత్రం అభివృద్ధిలో వెనుకబడే ఉంది.



కనకదుర్గమ్మ కాలనీ రహదారిపై మురుగునీరు

అధ్వానంగా రహదారులు

కాలనీలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు పడితే చాలు చిత్తడిగా తయారై బురదమయంగా మారుతున్నాయి. వర్షాల సమయంలో కాలనీలోకి రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కచ్చా డ్రెయిన్లు సరిగా లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉంటోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీలో నుంచి మురుగునీరు పోయే మార్గం సక్రమంగా లేకపోవడంతో మురుగులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

తాగునీటి సమస్య

కాలనీలో బోరు ఏర్పాటు చేసి డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీటిని పంచాయతీ సరఫరా చేస్తోంది. అయితే బోరు కెపాసిటీ చిన్నది కావడంతో స్థానికుల తాగునీటి అవసరాలకు ఇది ఏ మాత్రం సరిపోవడం లేదు. తాగునీరు సక్రమంగా అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. అలాగే పలు ఖాళీ స్థలాల్లో ఇళ్లు నిర్మించకుండా వదిలేయడంతో మురుగు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉంటోంది. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంటోంది. అధికారులు స్పందించి కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతోపాటు మురుగునీటి పారుదల, తాగునీటి సక్రమ సరఫరా, పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం తగదు



కనకదుర్గమ్మ కాలనీ అభివృద్ధి పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదు. 20 ఏళ్లగా అనేక సమస్యలతో సతమతమవుతున్నాం. ఓట్ల కోసం వచ్చే నాయకులు మా సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు.

–ఎం. నాగలక్ష్మి, తోట్లవల్లూరు

బురద రోడ్లే శరణ్యం



కాలనీలో రోడ్ల అభివృద్ధి జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షమొస్తే బురద రోడ్లపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. బురద రోడ్లపై నడవలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–సైదాబీ, తోట్లవల్లూరు

ఎక్కడి మురుగు అక్కడే



దుర్గమ్మ కాలనీలో మురుగునీరు ముందుకు సాగే పరిస్థితి లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచి పోతుండటంతో ఇళ్ల చుట్టూ దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు పారుదలకు అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు తొలగించాలి.

–మంగారావు, తోట్లవల్లూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: నందివాడ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ, తమిరిశ, శ్రీనివాసపురం, తుమ్మలపల్లి, వెన్ననపూడి, జనార్దనపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు



తోట్లవల్లూరు: యూరియా కోసం అన్నదాతలు అనేక అవస్థలు పడాల్సిన దుస్థితి వచ్చింది. మండలంలోని వల్లూరుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం ఆరు గంటల నుంచి క్యూలో నిలబడితే రెండు బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారని రైతులు వాపోయారు. కూటమి ప్రభుత్వంలో యూరియా కోసం కూడా ఇన్ని పాట్లు పడాల్సి రావడం దురదృష్టకరమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలతో కూడిన అర్జీలను ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూరి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, కుమారులు శ్రీనివాసరావు, రఘుబాబు రూ.1,11,116లు అందజేశారు. రఘు కుటుంబ సభ్యులు, స్నేహితులు లక్ష రూపాయలు, మారగాని సుబ్బారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు రూ.1,11,116లు, పులి గంగాధరరావు, ఆదిలక్ష్మి, సాయి, అంజి రూ.1,11,116లు, పరిసే శ్రీనివాసరావు, మంగమ్మ, మహేశ్వరీలు రూ.1,11,116లు, మారగాని నాగేశ్వరరావు, సీతారామ, సత్యవరప్రసాద్, మహేష్ కుటుంబ సభ్యులు రూ.1,11,116లు భూరి విరాళాలు అందించారు. ఈ మొత్తం విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక చేయూత

కైకలూరు: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి ఆర్థిక చేయూత అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రీన్ విలేజ్ పరిశీలనకు వచ్చిన ఆయన సీఎన్నార్ గార్డెన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో అర్బన్‌లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు నివేశన స్థలాలు మంజూరు చేస్తామని, రూ.2.50 లక్షలు గృహ నిర్మాణం కోసం మంజూరు చేస్తామని తెలిపారు. అదనంగా బీసీలు, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల నుంచి లక్ష రూపాయలు కేటాయించినట్టు చెప్పారు. ఆకివీడు వెళుతూ కైకలూరు వచ్చిన హోంమంత్రి అనిత మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో డాగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కొత్త కాంట్రాక్టర్‌తో గ్రీన్ విలేజ్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి నిర్మాణాలను వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కైకలూరు సీఎన్నార్‌లో జరిగిన సమీక్షలో మంత్రులు పార్థసారథి, అనిత, ఎమ్మెల్యే కామినేని

‘గ్రీన్ విలేజ్’ను పరిశీలించని మంత్రి..!

- మహిళా లబ్ధిదారులకు మాట్లాడే అవకాశం దక్కని వైనం
- ఏడాది కూటమి పాలనలో కాలనీని పట్టించుకోని పాలకులు

కైకలూరు: ఏడాది కూటమి పాలనలో గ్రీన్ విలేజ్ కాలనీలో రోడ్లు వేయలేదు.. వర్షం కురిస్తే నిండా నీరే.. విద్యుత్ లైట్లు అన్నీ లేవు. తాగునీటి సమస్య ఇలా ఒకటా రెండా.. అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతోన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో 94.52 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌గా దీనికి నామకరణ చేశారు. మొత్తం 3,072 లే అవుట్లకుగాను 2,761 పట్టాలను పంపిణీ చేశారు. వీటిలో 2,020 గృహాలకు నిర్మాణ అనుమతులు వచ్చాయి. మూడు కేటగిరిల్లో కలిపి 504 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఏడాది పాలన తర్వాత సోమవారం గ్రీన్ విలేజ్‌కు వచ్చిన గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి స్థానిక సమస్యలను పరిశీలించకుండానే వెళ్లిపోయారు.

మహిళలకు మిగిలింది నిరాశే..

మొదటిసారి కాలనీ సమస్యలను తెలుసుకోడానికి మంత్రి పార్థసారథి వస్తున్నారని తెలిసి కాలనీలో మహిళలు, పురుషులు టెంటు వేసుకుని గంటల తరబడి ఎదురుచూశారు. మహిళలు తమ గోడును మంత్రికి విన్నవించుకోవాలని ఆత్రుతతో ఉన్నారు. అయితే మంత్రి రావడానికి కొంత సమయం ముందు వచ్చిన నాయకులు, అధికారులు సమీప సీఎన్నార్ గార్డెన్‌లో గృహ నిర్మాణ సమీక్షలో మీతో మాట్లాడతారని అక్కడికి మహిళలను తీసుకెళ్లారు. అనుకున్న సమయానికి గంటన్నర ఆలస్యంగా మంత్రి సారథి కాలనీకి వచ్చారు. కాలనీ ప్రారంభంలో కొద్ది నిమిషాలు మాట్లాడి వెంటనే సమీక్ష కోసం సీఎన్నార్‌కు వెళ్లారు. మంత్రిని లబ్ధిదారులతో మాట్లాడించాలని చెప్పినప్పటికీ నాయకులు వారికి అవకాశం ఇవ్వలేదు. కాలనీలో కూటమికి అనుకూలంగా ఉండే వ్యక్తి చెత్తను తొలగించిన అంశాన్ని పొగుడుతూ, కాలనీ సమస్యలను చెప్పలేదు. దీంతో తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వస్తుందనుకున్న స్థానిక మహిళలకు నిరాశే మిగిలింది.

గత పాలకులను తిట్టడానికే ఎక్కువ సమయం

సమీక్షలో మంత్రి పార్థసారథి గ్రీన్ విలేజ్ సమస్యలను పరిష్కరిస్తామని, నిధులు కేటాయిస్తామని చెప్పారు. మిగిలిన నాయకులు వైఎస్సార్ సీపీ పాలనలో అనర్హులకు చోటు దక్కిందని, అవినీతి జరిగిందని ఎక్కువ సమయం తిట్టడానికి కేటాయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రీన్ విలేజ్‌లో అడుగుకో గుంత పడింది. మంత్రి స్వయంగా కాలనీలో పర్యటిస్తే సమస్యలు కళ్లకు కట్టినట్లు తెలిసేవని కాలనీ వాసులు బహిరంగంగానే చర్చించుకున్నారు.

గాయపడిన కార్మికునికి ఆర్థిక సాయం

గుడివాడ టౌన్: స్థానిక ఆటోనగర్‌లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికునికి రూ. 10 వేలు వితరణ ఇచ్చినట్లు ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హామీద్ తెలిపారు. సోమవారం నైజాం పేటలోని కార్మికుడు మహ్మద్ షబ్బీర్ నివాసంలో ఆర్థిక సాయం అందించారు. కార్మికుల సంక్షేమం కోసం తమ యూనియన్ అన్ని వేళలా పనిచేస్తుందని వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు టి. లక్ష్మణరావు, అబ్దుల్ ఖుద్దూస్, ఆంజనేయులు, షేక్ మొహిద్దీన్ బాషా, కె. నాగరాజు, డి. నాగరాజు, పి. వీర్రాజు, శ్యామ్‌బాబు, ఎ. వెంకటరమణ పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునికీకరణ



కలిదిండి (కైకలూరు): హిందూ సమస్తకుల మహా రుద్రభూమి (శ్మశానవాటిక, కలిదిండి) ఆధునికీకరణకు రూ.కోటి నిధులు కేటాయించిన దాత దొంతుబోయిన లెనిన్‌బాబు అభినందనీయులని గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కలిదిండిలో ఆధునికీకరణ చేసిన శ్మశానవాటికను సోమవారం ప్రారంభించారు. పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. అనంతరం కైకలూరు మార్కెట్‌యార్డులో నియోజకవర్గ సౌండ్, లైటింగ్, షామియానా, డెకరేషన్ ఓనర్స్ – వర్కర్స్ అసోసియేషన్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి వితరణ

కైకలూరు: స్థానిక తాలూకా సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జీఎంసీ బాలయోగి భవన నిర్మాణానికి ముదినేపల్లి మండలం చిగురుకోటకు చెందిన పులవర్తి శ్యామ్ రూ. 50వేలు వితరణగా సోమవారం అందించారు. దాతను కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, దళిత నేతలు వీరాబత్తిన సుధ, అర్జా యోహాను, కాగితాల విజయకుమార్, దండే రవిప్రకాష్, గడిదేసి విజయకుమార్, దండే సైమన్ తదితరులు అభినందించారు.


పీజీఆర్ఎస్‌కు 4 దరఖాస్తులు



గుడివాడ టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. హౌస్ ఫర్ ఆల్–1, మంచినీటి కుళాయి–1, చెత్త తొలగింపు–1, ఆక్రమణల తొలగింపు–1 అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సమస్యల తక్షణ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాబు మోసాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



ముదినేపల్లి రూరల్: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను వంచనకు గురిచేసి సీఎం చంద్రబాబు సాగిస్తున్న దారుణ మోసాలను ప్రజల ముంగిట ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని గురజ నాగేంద్రస్వామి ఆలయ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ మండలస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎన్నార్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో నోటికొచ్చిన వాగ్దానాలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత వాటి అమలుకు కుంటిసాకులు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో వైఎస్ జగన్ సమర్థవంతంగా అమలుచేసిన సంక్షేమ పథకాలకు నేడు అమలు చేయని సంక్షేమ పథకాలతో పోల్చి చూసుకుని ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన పని లేదని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజెప్పి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశానికి మండలంలోని అన్నిగ్రామాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రామరాజు, ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, సీనియర్ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ, సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ని పృథ్వీ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

తోట్లవల్లూరు: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కనకవల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మరీదు మనోహర్(17) ఉయ్యూరు నారాయణ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. కాలేజీకి వెళ్లకుండా తిరుగుతుండటంతో ఈ నెల 16న తల్లిదండ్రులు మందలించారు. దీంతో వారిని బెదిరిద్దామనే ఉద్దేశంతో అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న కలుపు మందు తాగాడు. మనోహర్‌ను వెంటనే కుటుంబసభ్యులు తొలుత ఉయ్యూరు, మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు, తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మనోహర్ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ అవినాష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

యువ రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభం

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో వరిలో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై యువరైతులకు ఆరు రోజుల నైపుణ్యత శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ నాణ్యమైన విత్తన ఉత్పత్తి చేయాలంటే మంచి విత్తనాలకు కొన్ని ప్రమాణాలు ఉండాలని సూచించారు. జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, తేమ శాతం, మొలక శాతం ఆవశ్యకతను వివరించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామీణ యువతకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



కేవీకేలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మంజువాణి

యాజమాన్య పద్ధతులపై చైతన్యం అవసరం



పెడన: వరిసాగులో యాజమాన్య పద్ధతులను అవలంభించేలా రైతులను చైతన్య పరచాల్సిన బాధ్యత ఉందని ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటరు డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి అన్నారు. సోమవారం పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాలులో పెడన, మచిలీపట్నం, గూడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకు(వీఏఏ)లకు వరి పంట సాగు యాజమాన్య పద్ధతులపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జ్యోతిరమణి మాట్లాడుతూ నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యాలతో పాటు చీడపురుగుల నివారణ, సేంద్రియ ఎరువుల వాడకం తదితర వాటిపై పలువురు సైంటిస్టులు వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, మచిలీపట్నం ఏడీఏ ఎన్.రమాదేవి, సైంటిస్టు రేవతి, ఏవోలు జెన్నీ, శివరామకృష్ణ, మధుకిరణ్, వీఏఏలు పాల్గొన్నారు.